



వేటగాళ్ల ఉచ్చులో పెద్దపులి

- తప్పించుకునే క్రమంలో తీవ్రగాయం
- కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించిన అటవీ అధికారులు
- నల్లమల అడవుల్లో రెస్క్యూ ఆపరేషన్
- బైర్లూటిలో వన్యప్రాణికి చికిత్సలు

దుర్భేధ్యమైన నల్లమల అడవుల్లో పెద్దపులిని రక్షించేందుకు అటవీ అధికారులు చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమైంది. ఇటీవల వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన పెద్దపులి దాన్ని తప్పించుకునేందుకు తీవ్ర గాయాలపాలైంది. దీంతో ఆ పులి పరిస్థితిని ట్రాప్స్ కెమెరాల ద్వారా గుర్తించిన అటవీశాఖ అధికారులు రెస్క్యూ ఆపరేషన్ చేయాలని భావించారు. గాయపడ్డ పెద్దపులి కోసం అటవీ అధికారులు నల్లమల అడవిని జల్లెడపట్టారు. పది రోజులపాటు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన ప్రత్యేక బృందం ఎట్టకేలకు పెద్దపులి జాడను కనిపెట్టింది. అతి కష్టంమీద ఆ పులిని బంధించి చికిత్సలు చేయిస్తున్నారు. మరో వారం రోజుల పాటు బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రంలో సపర్యలు చేయనున్నారు.

ఆత్మకూరు, మార్చి 5:


బైర్లూటిలో చికిత్స పొందుతున్న పులి

ముసలిమడుగు బీట్‌లో ఉచ్చు...

ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలోని ముసలిమడుగు బీట్ పరిధిలో సందుబాటు రస్తా వద్ద ఫిబ్రవరి 25వ తేదీన మూడేళ్ల వయస్సు గల ఓ ఆడపులికి కొందరు వేటగాళ్లు ఉచ్చు వేసినట్లు ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి తెలిపారు. ఆ సమయంలో పులి నడుము భాగంలో బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు కలిగి ఉండి తీవ్రంగా గాయపడినట్లు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. ఈ విషయాన్ని స్థానిక అటవీ అధికారులు నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్ బీఎస్ఎన్ మూర్తి, ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ అలాన్ చోంగ్ టెరాన్ దృష్టికి తీసుకెళ్లారు. వారు నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ దృష్టికి తీసుకెళ్లగా రెస్క్యూ ఆపరేషన్ ద్వారా గాయపడిన పులిని బంధించి చికిత్సలు చేయించాలని సూచించారు.



పెద్దపులి ఆచూకీ కోసం రెస్క్యూ టీం గాలింపు

వన్యవేటగాళ్లపై చర్యలుంటాయా?

పెద్దపులి పరిస్థితిని ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ బీఎస్ఎన్.మూర్తి స్వయంగా వచ్చి పర్యవేక్షించారు. గాయపడిన పులిని గుర్తించి సంరక్షించడం అరుదైన విషయమని తెలిపారు. వన్యప్రాణుల కోసం ఉచ్చులు వేసే వ్యక్తులపై నిఘా ఉంచామని, పట్టుబడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇదిలావుంటే బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చుతో వెలుగోడు రేంజ్‌లో కూడా ఓ పెద్దపులి మెడపై తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఈఘటన మరువక ముందే క్లచ్ వైర్ ఉచ్చుకు మరో పులి చిక్కడం ఆందోళన కలిగిస్తోంది. నిష్ణాతులైన వేటగాళ్లే ఈ ఉచ్చులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అటవీశాఖ ఎలాంటి తీసుకుంటుందో వేచిచూడాల్సిందే మరీ.

రెస్క్యూ ఆపరేషన్‌లో 55 మంది

ప్రమాదంలో పడ్డ పెద్ద పులిని గుర్తించిన అధికారులు టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీని ఆశ్రయించారు. వెంటనే మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఐదుగురితో కూడిన రెస్క్యూ బృందంతో పాటు 50 మంది అటవీశాఖ ఉద్యోగులు, ప్రొటెక్షన్ వాచర్లు బృందంగా ఏర్పడి పులిని పట్టుకునే ప్రయత్నం చేశారు. గాయపడిన పులి ముసలిమడుగు, శివపురం, గుమ్మడాపురం, కొత్తపల్లి గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో సంచరించినట్లు గుర్తించి ఆయా అటవీ ప్రాంతాల్లో 60 కెమెరా ట్రాప్స్‌తో పాటు రెండు డ్రోన్ కెమెరాల ద్వారా పదిరోజుల పాటు రేయింబవళ్లు అన్వేషణ మొదలుపెట్టారు.


ముసలిమడుగు గ్రామ సమీపంలో పెద్దపులి ఆచూకీ కోసం మహారాష్ట్ర బృందాల చర్యలు

హమ్మయ్యా... చిక్కిన పులి

దాదాపు పది రోజుల పాటు శక్తివంచన లేకుండా రెస్క్యూటీం కృషికి మంగళవారం ఫలితం వచ్చింది. ఎట్టకేలకు కొత్తపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి ఉన్నట్లు ప్రత్యేక బృందం గుర్తించింది. వెంటనే ఎన్‌క్లోసర్ గన్ ద్వారా మత్తుమందు ఇచ్చారు. మత్తులోకి జారుకున్న పెద్దపులిని బోనులో ఎక్కించి వన్యప్రాణి సంరక్షణ వాహనంలో బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రానికి తరలించారు. అక్కడ వైల్డ్‌లైఫ్ వెటర్నరీ డాక్టర్లచే చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం పులి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వారం రోజుల పాటు సపర్యలు చేసి గాయం నయమైన వెంటనే తిరిగి అటవీ ప్రాంతంలో వదిలి వేయనున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు.


పెద్దపులిని బంధించి బోనులో తరలిస్తున్న అటవీ అధికారులు



రావణవాహనసేవపై దర్శనమిస్తున్న స్వామి,అమ్మవార్లు


క్షేత్ర వీధుల్లో స్వామి,అమ్మవార్ల గ్రామోత్సవం

రావణ వాహనంపై మల్లన్న విహారం

- కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయం నుంచి పట్టువస్త్రాలు
- నేడు పుష్పపల్లకి

శ్రీశైలం, మార్చి 5: శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి రావణవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబైన రావణవాహనంపై ఆశీనులను చేసి ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయ రాజగోపురం నుంచి వెలుపలకు తీసుకొచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజాదికాలను నిర్వహించి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం జరిపారు.

పట్టువస్త్రాల సమర్పణ

శ్రీశైలంలో వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం తరపున ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఎ.మోహనరెడ్డి, ఈవో ఎ.వెంకటేశ్ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలతో వచ్చిన వీరికి శ్రీశైల దేవస్థానం ఈవో డి. పెద్దిరాజు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

నేడు పుష్పపల్లకిసేవ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు బుధవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు పుష్పపల్లకిసేవ నిర్వహించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను ఆహూతులను అలరించాయి. మాడవీధిలోని నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీ కళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో ఈ కార్యక్రమాలు కొనసాగాయి.


వివిధ రూపాల్లో కళాకారులు


కళాకారుల విన్యాసాలు



డోలు వాయిస్తున్న కళాకారులు


కోలాటం ఆడుతున్న యువతులు


కేరళ సంప్రదాయ వాయిద్య ప్రదర్శన


స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలను తీసుకొస్తున్న కాణిపాక దేవస్థాన సిబ్బంది




పాతాళగంగలో పుణ్యస్నానాలు

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి

గడివేముల, మార్చి 5: రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలైన పెసరవాయి, చిందుకూరులోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం వారు పరిశీలించారు. అనంతరం ప్రజలతో వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ప్రజలు ప్రలోభాలకు, భయాందోళనకు గురి కాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గత ఎన్నికల్లో ఘర్షణలు జరిగిన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. త్వరలోనే కేంద్ర బలగాలు కూడా వస్తాయని అన్నారు. అనంతరం జొన్న పంటను కొనుగోలు చేయాలని పెసరవాయి గ్రామ రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, గ్రామాల్లోని వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 622 మంది గైర్హాజరు

నంద్యాల టౌన్, మార్చి 5 : జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలలో భాగంగా మంగళవారం జరిగిన ఇంగ్లీష్-2 పేపర్ పరీక్షకు 622 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు. జనరల్ విభాగంలో 10,249 మంది విద్యార్థులకు గాను 9,698 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 551 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 1002 మంది విద్యార్థులకు గాను 931 మంది విద్యార్థులు హాజరు కాగా 71 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో బేతంచెర్ల చిన్నారికి స్థానం


చిన్నారి సీతామహాలక్ష్మికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తున్న విజయనాగరాజు

బేతంచెర్ల, మార్చి 5: పట్టణానికి చెందిన నరసింహ కుమార్ కుమార్తె సీతామహాలక్ష్మి అనే చిన్నారి భగవద్గీత శ్లోకాలలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకుంది. పట్టణంలోని సుమేధా పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న సీతామహాలక్ష్మి భగవద్గీతలోని 40 శ్లోకాలను 5 నిమిషాల 58 సెకన్లలో ఏకధాటిగా చెప్పి రికార్డు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు విజయ నాగరాజు, గుండా గోపాల్ బాలికకు సర్టిఫికెట్లు, మెడల్స్ ఇచ్చారు.

జోష్ పెంచిన జయహో బీసీ

- బలహీనవర్గాలకు చేరువయ్యేలా బీసీ డిక్లరేషన్
- ఆ సామాజికవర్గాల్లో ఆనందోత్సాహాలు


బీసీ డిక్లరేషన్ సభావేదికపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్

కర్నూలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయ.. సామాజిక.. విద్యా.. ఆర్థిక రంగాల్లో వెనుకబడిన బీసీల కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సంయుక్తంగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపింది. మంగళవారం మంగళగిరి వేదికగా విడుదల చేసి డిక్లరేషన్ బీసీ కులాలలో మరింత ఉత్సాహం పెంచింది. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సీఎం జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ 34 శతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో రాష్ట్రంలో 16,800 మంది పదవులు కోల్పోయారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ఘన విజయం సాధించి 34 శాతం పునరుద్ధరణతో కోల్పోయిన పదవులు బీసీలకే ఆ పదవులు దక్కనున్నాయి. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేతకు గురైన బీసీలు 1982లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీని వేదికగా మార్చుకొని ఎందరో రాజకీయంగా ఎదిగారు. పసుపు జెండాకు వెన్నుదన్నుగా నిలిచారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీ-జనసేన వెల్లడించి బీసీ డిక్లరేషన్‌పై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

చారిత్రాత్మక నిర్ణయం



చట్ట సభల్లో బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పించాలని ఏడు దశాబ్దాలుగా పోరాడుతున్నాం. ఏ రాజకీయ పార్టీ కూడా దీనిని పట్టించుకోలేదు. టీడీపీ 34 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తే సైకో జగన్ 24 శాతానికి తగ్గించాడు. చంద్రబాబు, పవన్‌లు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మక నిర్ణయం.

- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు


శుభ పరిణామం



ఏపీలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తామని, బీసీలకు 50 సంవత్సరాలకే పెంచన్ అందజేస్తామని ప్రకటించడం శుభపరిణామం. పది అంశాలతో కూడిన బీసీ డిక్లరేషన్ పత్రాన్ని విడుదల చేయడం హర్షణీయం.

-బత్తిన లోకనాథ్, పత్తికొండ మండలం

టీడీపీతోనే బీసీ సాధికారిత



టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలో ఉన్న 153 ఉప కులాలకు మేలు జరిగేలా ఉంది. వడ్డెర, రజక, చేనేత, వాల్మీకి, కురుబ, యాదవ, నాయిబ్రాహ్మణ కులాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా ప్రకటించడం హర్షణీయం.

-దేవేంద్రప్ప, ఆలూరు.

పెళ్లి కానుక రూ.లక్ష



ముప్పాతిక శాతం బీసీలు ఆర్థికంగా వెనుకబడిన వారే. ఆడపిల్లల వివాహాలు చేసేందుకు అప్పులు చేసి ఆర్థికంగా చితికిపోతున్నారు. టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ఇచ్చాక ఇచ్చే పెళ్లి కానుక రూ.లక్ష బీసీ తల్లిదండ్రులకు గొప్ప వరం. బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతంగా తీసుకెళ్లేలా ఈ డిక్లరేషన్ ఉంది.

-రేఖాగౌడ్, జన సేన పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి

బీసీల నడ్డివిరిచిన వైసీపీ

వైసీపీ ప్రభుత్వం చేనేత వస్త్రాలకు జీఎస్టీ విధించి చేనేతల నడ్డివిరిచింది. బీసీల డిక్లరేషన్‌లో చేనేతవస్త్రాలపై జీఎస్టీ రద్దుచేస్తామని ప్రకటించటం చేనేతలకు ఊరట. చేనేతలకు ఆర్థిక అభివృద్ధికి మరింత ఉపయోగపడుతుంది.

-మల్లికార్జున, ఎమ్మిగనూరు

బీసీలకు సామాజిక రక్షణ చట్టం

బీసీల రక్షణకోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు ప్రకటించటం హర్షించదగ్గ విషయం. రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

-చావిడి వెంకటేష్, మంత్రాలయం

బీసీల ఆర్థిక ప్రగతికి పెద్దపీట



బీసీలకు రక్షణ చట్టం, సబ్ ప్లాన్ నిధులు వల్ల బీసీలకు మరింత న్యాయం జరుగుతుంది. ఆర్థిక ప్రగతికి పెద్దపీట వేశారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదువుల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించడం అభినందనీయం. టీడీపీ-జనసేన కూటమి ఎంతో దూరదృష్టితో ఆలోచించి డిక్లరేషన్ విడుదల చేశారు.

- నాగరాజు యాదవ్, టీడీపీ



జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయింపులు, సబ్ ప్లాన్ నిధులు రూ.1.50 లక్షల కోట్లు బీసీలకే వినియోగించేలా బీసీ డిక్లరేషన్‌లో అధినేత చంద్రబాబు ప్రకటించడం అభినందనీయం. స్వయం ఉపాధి కోసం ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు వెచ్చించేలా యువతలో ఆర్థిక చేయుత అభిస్తుంది.

-మహేశ్‌గౌడ్, టీడీపీ బీసీ సెల్, పాణ్యం

చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్

చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించటం సాహసోపేతమైన నిర్ణయం. టీడీపీ బీసీలకు అండదండగా ఉంటుంది.

-ముగతి ఈరన్న గౌడ్, నందవరం

జడ్పీకి ఆర్థిక సంఘం నిధులు విడుదల

కర్నూలు(న్యూసిటీ), మార్చి 5: 2023-24 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత 15 ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంటు రూ.5.12 కోట్లు, టైడ్ గ్రాంట్ రూ.7,69 కోట్లు మొత్తం రూ.12.81 కోట్లు, 53 మండల పరిషత్‌లకు బేసిక్ గ్రాంట్ రూ.5.13 కోట్లు, టైడ్ గ్రాంట్ రూ.7.69 కోట్లు మొత్తం రూ.12.82 కోట్లు జిల్లా పరిషత్, మండల పరిషత్తుకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు పేర్కొన్నారు.

ఇంటర్‌లో 813 మంది విద్యార్థులు గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 5: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం మంగళవారం జరిగిన పరీక్షకు 813 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 20,927 మంది ఉన్నారు. ఇందులో 20,114 మంది పరీక్షకు హాజరు కాగా, 813 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవోతో పాటు డీవీఈవో జమీర్‌పాషా, డీఈసీ సభ్యులు తనిఖీలు నిర్వహించారు.

టీసీసీ ఫలితాలు విడుదల

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 5: ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాల మేరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ)కు సంబంధించి పరీక్షా ఫలితాలు ప్రకటించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలను డిసెంబరు 17న నిర్వహించినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైనవారు సంబంధిత సర్టిఫికెట్ల కోసం డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పాసింగ్ విధానం వద్దు

- ఆదోని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


వేరుశనగ వ్యాపారులతో సమావేశమైన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 5: మార్కెట్ యార్డులో వేరుశనగకు పాసింగ్ (గ్రేడింగ్) విధానాన్ని స్వస్తి పలకకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో వేరుశనగ వ్యాపారులతో సమావేశమయ్యారు. ఆంధ్రజ్యోతిలో వెలువడిన "వ్యాపారుల మాయాజాలం, పాసింగ్‌తో రైతులు దగా" అనే కథనానికి మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించారు. సాయంత్రం వేరుశనగ వ్యాపారులను కార్యాలయానికి పిలిపించి సమావేశమయ్యారు. మార్కెటింగ్ శాఖ బైలాలో రైతులు తెచ్చిన దిగుబడికి కూలీలతో పాసింగ్ చేయాలని ఎక్కడా లేదన్నారు. రైతులకు నష్టం చేకూర్చే ఈ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికే కూలీల చేత శుభ్రం చేయించడం, ఆలస్యంగా గన్నీ బ్యాగులను తీసుకొచ్చి సాయంత్రం తూకాలు వేసుకోవడం మంచిది కాదని తెలియజేశామన్నారు. ఇకనుంచి అయిన వ్యాపారులంతా రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయాలని తెలిపారు. వేరుశనగ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు శరణప్ప మాట్లాడుతూ రైతులు రాళ్లు, మట్టి, చెత్తా, చెదారంతో వేరుశనగ తీసుకొస్తున్నారని తెలిపారు. దీనివల్ల తాము కూడా నష్టపోతున్నామని, అందుకే కూలీలతో పాసింగ్ చేయిస్తున్నామన్నారు. రైతులు శుభ్రంగా వేరుశనగను తీసుకొస్తే కొనుగోలు చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రైతులు లేదా కమిషన్ ఏజెంట్లు వాళ్లే బాధ్యత తీసుకోవాలని కోరారు. దీనిపై కమిషన్ ఏజెంట్లను, వ్యాపారులను మరోసారి సమావేశపరిచి రైతులను చైతన్యపరిచేలా అవగాహన కల్పిస్తామని అధికారులు తెలిపారు.

నిందితుడి అరెస్టు

11 తులాల బంగారం, 20 వేల నగదు స్వాధీనం

నందికొట్కూరు, మార్చి 5: మిడ్తూరు మండలం తలముడిపి గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడ్ని అరెస్టు చేసి అతడి నుంచి 6,00,800 విలువైన బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నట్లు నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ తెలిపారు. మంగళవారం నందికొట్కూరు రూరల్ పోలీస్టేషన్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన తలముడిపి గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ గౌస్ ఇంట్లోని బాసెలెట్, గొలుసు, 3 ఉంగరాలతో పాటు రూ.20 వేల నగదు దొంగతనానికి గురైనట్లు మిడ్తూరు పోలీస్టేషన్‌లో కేసు నమోదైందని అన్నారు. దొంగతనం జరిగిన 3 రోజుల్లోనే నిందితుడ్ని అరెస్టు చేశామని అన్నారు. నిందితుడు నందికొట్కూరులోని అల్లూరు రోడ్డులో నివాసముంటున్న షేక్ మహ్మద్ హుస్సేన్‌గా గుర్తించి అతడి నుంచి 11 తులాల బంగారాన్ని, రూ. 20 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడ్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో మిడ్తూరు ఎస్ఐ జగన్మోహన్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు

నంద్యాల టౌన్, మార్చి 5: జిల్లాలో ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకున్న రైతుల నుంచి నాఫెడ్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ ద్వారా శనగ, వేరుశనగ, పెసలు, మినుములను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ అయ్యాయని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు తెలిపారు. రైతుల నుంచి ఆయా పంటల దిగుబడులను ఆర్‌బీకేల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు తమ సమీప ఆర్‌బీకేలలో తమ వివరాలను నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనగలు మద్దతు ధర క్వింటం రూ.5440, మినుములు క్వింటం రూ.6950, పెసలు మద్దతు ధర క్వింటం రూ.8558, వేరుశనగ మద్దతు ధర క్వింటం రూ.6377 ప్రకారం కొంటారని తెలిపారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలలో నాఫెడ్ నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాల మేరకు కొనుగోలు ఉంటుందని మేనేజర్ నాగరాజు తెలిపారు.

వైసీపీ మళ్లీ వస్తే.. ప్రజల ఆస్తులు తాకట్టు

- జగన్, బుగ్గన ఇద్దరూ మోసగాళ్లే..
- చంద్రబాబును గెలిపించుకుంటేనే భవిష్యత్తు
- కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 5: సచివాలయాన్ని తాకట్టు పెడుతున్న వైసీపీ ప్రభుత్వం మళ్లీ వస్తే.. ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం డోన్ మండలంలోని ఆవులదొడ్డి, తిమ్మాపురం, కామగానికుంట్ల, సోంపురం గ్రామాల్లో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇద్దరూ మోసగాళ్లేనని, రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన ఘనత వారికే దక్కిందని అన్నారు. సీఎం పదవిని అడ్డం పెట్టుకుని జగన్ లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. తానేమి తక్కువ కాదంటూ మంత్రి బుగ్గన వేల కోట్లు సంపాదించారని ధ్వజమెత్తారు. తన తండ్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండుసార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టినా ప్రజలకు సేవ చేసి ప్రేమాభిమానాలు సంపాదించుకున్నారని అన్నారు. మంత్రి బుగ్గన డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. గత 50 ఏళ్ల నుంచి కోట్ల, కేఈ కుటుంబాలే డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాయన్నారు.

బీసీల కోసం ఎంపీ సీటు త్యాగం చేశా

కర్నూలు పార్లమెంటు బీసీలకు ఇస్తామని చంద్రబాబు చెప్పడంతో వారి కోసం త్యాగం చేశానని కోట్ల అన్నారు. తాను కర్నూలు పార్లమెంటు స్థానం నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచానని, కేంద్ర మంత్రిగా కూడా పని చేశానని అన్నారు. ఈసారి తనకు కావాలని అడిగినా వచ్చేదన్నారు. బీసీలు కూడా రాజకీయంగా ఎదగాలని ఉద్దేశంతోనే త్యాగం చేసి చంద్రబాబు కోరిక మేరకు డోన్ అసెంబ్లీ నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాల్సి వచ్చిందన్నారు. డోన్ నియోజకవర్గ ప్రజలతో కోట్ల కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని అన్నారు. మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు రుణపడి ఉంటానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, భాస్కర్ నాయుడు, దేవరబండ వెంకటనారాయణ, చిట్యాల మద్దయ్యగౌడు, రంజిత్ కిరణ్, ఎస్ఎండీ రఫీ, వలసల బాలుడు, శ్రీరాములు, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పరదేశీ మహేష్, దిలీప్ రెడ్డి, భూమా నాగన్న, మిద్దెపల్లి గోవిందు, వెంకటాపురం పెద్దయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

మంత్రాలయం/పత్తికొండ టౌన్, మార్చి 5: మంత్రాలయం, పత్తికొండ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం కలెక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లు పరిశీలించారు. పత్తికొండలో జూనియర్ కళాశాలను, మంత్రాలయంలో పరిమళ విద్యానికేత్ పాఠశాలలను పరిశీలించారు. మంత్రాలయం మండలంలో సమస్యాత్మక గ్రామం మాధవరం 52వ పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఈవీఎంల పంపిణీ, పార్కింగ్, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అనంతరం మావరం చెక్‌పోస్టును ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మాధవరం చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్లు మాధవరావు, శ్రీధర్‌రావు, ఎంపీడీవో మునెప్ప, మంత్రాలయం, కోసిగి సీఐలు ఎరిషావలి, ప్రసాద్, ఎస్ఐలు కృష్ణమూర్తి, గోపినాథ్, డీటీలు రాఘవేంద్ర, శశిశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.


మంత్రాలయంలో స్ట్రాంగ్‌రూమును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, అధికారులు

మిర్చి రైతు ఆవేదన

- వ్యాపారుల సిండికేట్‌తో భారీగా ధర పతనం
- క్వింటా గరిష్ఠ ధర రూ.17,191
- రూ.5వేలకు పైగా పతనం


కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు విక్రయానికి తెచ్చిన ఎండుమిర్చి బస్తాలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 5: పంట సాగుకు పెట్టిన ఖర్చులు పోను కొంతైనా లాభం వస్తుందనే ఆశతో ఉన్న మిర్చి రైతులకు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలోని రైతులేగాక తెలంగాణ రైతులు కూడా కర్నూలు మార్కెట్ యార్డుకు ఎండుమిర్చి విక్రయానికి తీసుకువస్తుంటారు. అయితే.. గత నెలలో రూ. 20 వేల నుంచి రూ. 30వేలకు పైగానే క్వింటం ఎండుమిర్చి అమ్ముడుపోయినప్పటికీ మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర క్వింటానికి కేవలం రూ.17,191 మాత్రమే పలికింది. నెల రోజుల వ్యవధిలో దాదాపు 5వేలకు పైగానే ధర తగ్గిపోవడం ఏమిటని రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. వ్యాపారులు వివిధ కారణాలు చూపుతూ ధరను భారీగా తగ్గిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వ్యాపారులను కట్టడి చేయడంలో అక్రమాలను నిరోధించడంలో మార్కెట్ కమిటీ అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోలేకపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర కేవలం రూ.17,191 మాత్రమే రైతులకు లభించింది. మధ్యస్థ ధర రూ.10,899, కనిష్ఠ ధర మరింత ఘోరంగా రూ.800కు మాత్రమే అమ్ముడుపోయింది. వేరుశనగ కాయలకు ధర లభించడం లేదు. క్వింటానికి గరిష్ఠంగా రూ.7,069, మధ్యస్థ ధర రూ.5,970, కనిష్ఠ ధర రూ.2,222 మాత్రమే లభిస్తోంది. ఆముదాలకు క్వింటానికి గరిష్ఠంగా రూ.5,472, మధ్యస్థ ధర రూ.5,382, కనిష్ఠ ధర రూ.5,091 మాత్రమే లభించింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,161, మధ్యస్థ ధర రూ.1,939, కనిష్ఠ ధర రూ.1,719 మాత్రమే లభించింది. శనగలకు గరిష్ఠంగా రూ.6,039, మధ్యస్థ ధర రూ.5,096, కనిష్ఠ ధర రూ.3,010 మాత్రమే రైతులకు అందింది. ఉల్లిగడ్డలపై గరిష్ఠ ధర రూ.1,569, మధ్యస్థ ధర రూ.1,489, కనిష్ఠ ధర రూ.319 మాత్రమే లభించింది. కర్నూలు మార్కెట్ కమిటీ యార్డులో కొర్రలకు గరిష్ఠంగా రూ.4,069, మధ్యస్థ ధర రూ.4,049, కనిష్ఠ ధర రూ.4,029 మాత్రమే లభించింది. మినుములకు గరిష్ఠ ధర రూ.9,791, మధ్యస్థ ధర రూ.8,969, కనిష్ఠ ధర రూ.5,019 ధర లభించింది.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

ఎండుమిర్చి అమ్మకాల్లో వ్యాపారులు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు. తూకాలు తదితర వాటిల్లో వ్యాపారులు అక్రమాలకు పాల్పడినట్లు రైతులు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి వారి లైసెన్సులు రద్దు చేస్తాం.

- గోవిందు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్ గడువు పెంపు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 5: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్ఎల్ డయోగ్నస్టిక్ సెంటర్‌కు ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో మంగళవారం ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్‌పై హెచ్‌వోడీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఎస్ఎల్ డయోగ్నస్టిక్ గడువును నెల రోజులు పెంచినట్లు సిటీ స్కానింగ్‌కు సంబంధించిన కేసులు రోటీన్‌గా పంపించాలని హెచ్‌వోడీలను ఆదేశించారు. ఆసుపత్రిలో కొత్తగా చేరిన హౌస్ సర్జన్లు తప్పనిసరిగా డ్రస్ కోడ్, ఐడీ కార్డు, సమయపాలన ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆసుపత్రి క్యాజువాల్టీలో పల్మనాలజీ వైద్యులను నియమించి వారికి డ్యూటీ రోస్టర్ వేసేలా సీఎస్ఆర్ఎంవోకు ఆదేశించారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఆర్ఎంవో వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ శివబాల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

నిందితుడిని విచారిస్తున్నాం

మహిళ హత్య బాధాకరం: సీఐ



అవుకు, మార్చి 5: అవుకు బస్టాండు సర్కిల్‌లో కుమారి అనే మహిళను నరికి చంపిన ఆమె భర్త రంగస్వామిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని బనగానపల్లె సీఐ గంటాసుబ్బారావు అన్నారు. మంగళవారం అవుకు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మహిళను విచక్షణా రహితంగా నరికి హత్య చేసిన ఘటన బాధాకరమని అన్నారు. ఈ నెల 4వ తేదిన కుమారి, ఆమె పిన్ని సుబ్బలక్ష్మమ్మ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా డ్యూటీలో ఉన్న పోలీసులు సరైన రీతిలో స్పందించక పోవడంపై విచారణ జరుపుతున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించండి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), మార్చి 5: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సజావుగా, సమర్థవంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు విడతలవారీగా శిక్షణ కార్యక్రమాల్లో సంపూర్ణ అవగాహన పొంది ఎలాంటి విమర్శలకు తావివ్వకుండా విజయవంతం చేయాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో మంగళవారం ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గాల మాస్టర్లు, ట్రైనర్లు, సెక్టోరియల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్వో పద్మజ, నంద్యాల, ఆత్మకూరు, ఆర్డీవోలు, నంద్యాల మున్సిపల్ కమిషనర్, తదితరులు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలు తప్పకుండా అమలుపరుస్తూ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన 12 యాప్స్‌పై అవగాహన ఉండాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు మ్యాపింగ్ చేసి ప్రతిపాదనలు ఉంటే వెంటనే సమర్పించాలని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాలలో 5, డోన్‌లో 2, శ్రీశైలంలో ఒకటి, బనగానపల్లెలో ఒక పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు ఇస్తే ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తామని కలెక్టర్ చెప్పారు. సమయం తక్కువ ఉందని, అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని అన్ని మండలాల తహసీల్దార్లను ఆదేశించారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'


జూలేపల్లె సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

గోస్పాడు, మార్చి 5: సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలను పరిష్కరించాలని డీఎల్‌డీవో మురళీకళ్యాణి సూచించారు. మండలంలోని జూలేపల్లె, యాళ్ళూరు సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. బయోమెట్రిక్ అటెండెన్స్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, సచివాలయాల్లో అర్జీలను పరిశీలించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో నాగఅనసూయ, తదితరులు ఉన్నారు.

'ఉపాధి కల్పనలో వైసీపీ విఫలం'


మేనిఫెస్టో గురించి వివరిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల టౌన్, మార్చి 5: రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో యువతకు ఉపాధి కల్పించడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ధ్వజమెత్తారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని నూనెపల్లె నివర్తినగర్‌లో టీడీపీ సూపర్ -6 పథకాలను వివరిస్తూ ప్రచార కరపత్రాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందజేశారు. 29వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మంజుల సుబ్బరాయుడు, మాజీ కౌన్సిలర్ వాకా శివశంకర్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఫిరోజ్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి కలగడానికి కారణం వైసీపీ ప్రభుత్వమేనని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నంద్యాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, గతంలో నియోజకవర్గ అభివృద్ధి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్న విషయం ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ నాయకుల అసత్య ప్రచారాలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల తనిఖీ


వెంకటాపురంలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి ప్రసన్నలక్ష్మి

ఆత్మకూరు రూరల్, మార్చి 5: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వస్తున్న భక్తుల కోసం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డా.ప్రసన్నలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. వెంకటాపురం గ్రామంలో, నాగలూటిలో ఆత్మకూరు పట్టణంలో మలేరియా సెంటరులో, శివార్లలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను పరిశీలించి అక్కడి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్కడ అందించే వైద్య సేవల గురించి వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌ను ఆరా తీశారు. యాత్రికులకు సత్వర ఆరోగ్య సేవలు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం అక్కడి 108లో పాదయాత్రికులకు సత్వర సేవలు ఎలా అందించాలో 108 సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాదయాత్రికులకు సత్వర సేవలు అందించేందుకు ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో భక్తులు ఉదయం పదిగంటల లోపుకాని, సాయంత్రం 4 గంటల తర్వాత పాయాత్రను కొనసాగించాలని అలాగే వైద్య శిబిరాల్లో అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ పద్మావతి, ఫాతిమా, యశోద, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

'రామ్మోహన్‌రావు సేవలు చిరస్మరణీయం'


నివాళి అర్పిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఆత్మకూరు, మార్చి 5: ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు రామ్మోహన్‌రావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షఫివుల్లా, రీజనల్ నాయకులు సీకే కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం రామ్మోహన్‌రావు 19వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు కలీముల్లా, ఎస్ఆర్‌రెడ్డి, ఎంఎంబాషా, ఎంఎస్ బాషా, రెహంతుల్లా, ఆజాద్, నిజామొద్దీన్, అబ్దుల్లా, రమణ, అలీషేర్ తదితరులు ఉన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల టౌన్, మార్చి 5: రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ డిప్లొమా కోర్సులలో ప్రవేశం కోసం 2024 -2025 విద్యాసంవత్సరానికిగాను నిర్వహించే పాలిసెట్‌కు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని నంద్యాల ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌వీహెచ్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యా, శిక్షణా మండలి పాలిసెట్ -2024 నోటిఫికేషన్‌ను గత నెల 17వ తేదీన విడుదల చేసినట్లు తెలిపారు. పాలిసెట్ రాయడానికి ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షకు మార్చి/ఏప్రిల్ 2024లో హాజరు కాబోతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 దరఖాస్తు రుసుంను హెల్ప్‌లైన్ / గేట్‌వే ద్వారా చెల్లించి ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని ఏప్రిల్ 5వ తేదీ వరకు దాఖలు చేయడానికి గడువు ఉందని అన్నారు. పాలిసెట్ పరీక్షను ఏప్రిల్ 27న నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని దాఖలు చేసే సమయంలో సమస్యలు ఎదురైతే హెల్ప్‌లైన్ సెంటర్స్‌ను సంప్రదించవచ్చాన్నారు. పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షకు శిక్షణ పొందేందుకు ఉచిత స్టడీ మెటీరియల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. నంద్యాలలో ఉచిత శిక్షణను ఈనెలాఖరు నుంచి ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇస్తారని తెలిపారు. అప్లికేషన్ కోసం ఎస్ఎస్‌సీ హాల్ టికెట్, సెల్ ఫోన్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పొలం ఆక్రమించుకున్నారని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

● పరామర్శించిన గౌరు వెంకటరెడ్డి


బాధితుడిని పరామర్శిస్తున్న గౌరు వెంకటరెడ్డి

నంద్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పొలాన్ని ఆక్రమించుకున్నారని మనస్తాపం చెంది పాణ్యం మండలం గగ్గటూరుకు చెందిన బాలనాగప్ప మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశారు. బాలనాగప్ప భార్య మెండుగూడెల మాధవి తెలిపిన వివరాలివి.. తాము గగ్గటూరులో వారసత్వంగా వచ్చిన భూమిని వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నామని, తమ భూమిని కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని ఇతరులకు అమ్మేశారని మాధవి చెప్పారు. ఆ విషయం తమకు తెలిసి కోర్టులో కేసు వేశామన్నారు. ప్రస్తుతం ఆ కేసు నడుస్తున్నా, దౌర్జన్యంగా తమ భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, దీంతో మనస్తాపం చెందిన తన భర్త పురుగుల మందు తాగారని చెప్పారు. ప్రస్తుతం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, తమకు అధికారులు న్యాయం చేయాలని కోరారు. టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే మనుషులు ఇలా ఎక్కడ పడితే అక్కడ భూములను అక్రమంగా ఆక్రమించుకుంటూ అమాయకులను ఇబ్బందులు పాలుజేస్తున్నారని, ఇప్పటికే ఆయన అరాచకాలపై కర్నూలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఇపుడు మరో అమాయకుడు ఆయన అనుచరుల దాష్టీకానికి ఆత్మహత్యాయత్నం చేశారని, అధికారులు ఎమ్మెల్యే అనుచరులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిపై కత్తితో దాడి

నంద్యాల క్రైం, మార్చి 5: నంద్యాల పట్టణానికి చెందిన రాజు అనే వ్యక్తిని పెద్దకొట్టాలకు చెందిన రాముడు అనే వ్యక్తి కత్తితో పొడిచాడు. ఈ ఘటన సోమవారం రాత్రి కలకలం రేపింది. స్థానికులు వెంటనే అతడిని నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. వివరాలివి.. రాజు బావమరిది ఫ్రెండ్ కోసం పెద్దకొట్టాల రాముడు దగ్గర వడ్డీకి డబ్బులు అప్పు తీసుకున్నారు. అయితే వడ్డీకి తీసుకున్న వ్యక్తి డబ్బులు కట్టకుండా పారిపోయాడు. అయితే అతడు కనిపించడంలేదని రాజు బావమరిదిని పట్టుకొని అతడి ఆటోను కొట్టాల రాముడు నిన్న రాత్రి సంజీవనగర్ సెంటర్‌లో గుంజుకున్నాడు. మధ్యవర్తితో రాజు మాట్లాడేందుకు వెళ్లగా పెద్దకొట్టాల రాముడు తన దగ్గర ఉన్న కత్తితో రాజు కడుపులో పొడిచాడు. గాయపడిన రాజును స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

9న దివ్యాంగుల మహాగర్జన


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, మార్చి 5: అమరావతిలో ఈనెల 9న దివ్యాంగుల మహాగర్జన నిర్వహిస్తున్నామని, వచ్చి జయప్రదం చేయాలని ఎంపీఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నంద్యాలలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగుల రోస్టర్ 56ను, బధిరుల రోస్టర్ 31ని, మిగతా రోస్టర్లను 10లోకి మార్చాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలగించిన 95 వేల వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం 21 డిమాండ్లతో చలో అమరావతి మహాగర్జన నిర్వహించబోతున్నామని వెల్లడించారు. సమావేశంలో నాయకులు జెనర్జీ, సామేలు, ఓబులేసు, వెంకటసుబ్బన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం

వెలుగోడు మార్చి 5: వెలుగోడు పట్టణంలోని ఎంపీడీవో కార్యలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. మంగళవారం ఎంపీపీ లాలం రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్ వర్మ సమావేశం నిర్వహించారు. మండలంలోని కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదని సర్పంచులు మండిపడ్డారు. వేల్పనూరు గ్రామంలో బోర్లకు హ్యాండిల్స్ లేక నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు చెప్పిన పట్టించుకోనే దిక్కులేదని ఎంపీటీసీ సభుడు జనాబ్‌రెడ్డి అన్నారు. మోత్కూరు గ్రామంలో సీడబ్ల్యూఎస్ స్కీం నుంచి నీరు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లు మరమ్మతులు చేపించాలని కోరారు. మండలంలో నాడు నేడు పాఠశాల నిర్మాణాలలో సిమెంటు కొరతతో పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు వివిధ గ్రామాలలో సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు పాల్గొన్నారు.

'మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి'

ఆత్మకూరు, మార్చి 5: రాజ్యాంగ హక్కులను ధ్వంసం చేస్తూ మహిళల హక్కులను కాలరాస్తున్న పాలకవర్గ పార్టీలకు వ్యతిరేకంగా పోరాడుదాం అనే నినాదంతో మార్చి 8వ తేదిన నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో మహిళలతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలపై హింస, దోపిడీ, అణచివేత తరతరాలుగా కొనసాగుతోందని వివరించారు. మహిళలకు రక్షణకు ఉన్న చట్టాలను నీరుగారుస్తున్నారన్నారు. నాయకులు అరుణ్‌కుమార్, పీడీఎస్‌యూ నాయకులు జునైద్‌బాషా తదితరులు ఉన్నారు.

మహానందికి బయలుదేరిన బ్రహ్మానందీశ్వరుడు


మహానందికి బయలుదేరిన బ్రహ్మానందీశ్వరుడు, మహానందీశ్వర స్వామి

నంద్యాల (కల్చరల్), మార్చి 5: మహానందీశ్వరుని పెళ్లి పెద్దగా మంగళవారం ప్రత్యేక పల్లకిలో నంద్యాల బ్రహ్మానందీశ్వరుడు మహానందికి వెళ్లారు. మహానందిలో శివరాత్రి రోజు ఆదిదేవుడి కళ్యాణానికి బ్రహ్మానందీశ్వరుడు పెళ్లిపెద్దగా ప్రత్యేక పల్లకిలో బయలుదేరారు. మహానందిలో జరిగే శివరాత్రి ఉత్సవాలలో భాగంగా మహానందీశ్వరుల కల్యాణ పెద్దగా నంద్యాల బ్రహ్మానందీశ్వరుడు వెళ్లి మహానందీశ్వరుల కళ్యాణం నిర్వహించి తిరిగి రావడం ఆనవాయితీగా వస్తోంది. మహానందీశ్వరుల ఉత్సవమూరులు, బ్రహ్మానందీశ్వరుడు బ్రహ్మానందీశ్వ రాలయం నుంచి కల్పనసెంటర్‌లోని విడది మండపం, బంగారు అంగళ్ల మీదుగా గ్రామోత్సవంలో పూజలందుకొని పెళ్లిపెద్దగా బ్రహ్మానందీశ్వరుడు, మహానందీశ్వర ఉత్సవమూర్తులు మహానంది ఉత్సవాలకు బయలు దేరారు. కార్యక్రమంలో మహానంది ఆలయ సిబ్బంది, అర్చకులు, బ్రహ్మానందీశ్వరాలయ ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులు కానాల మురళీకృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'నీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలి'

ఆత్మకూరు, మార్చి 5: వేసవిలో గ్రామాల్లో నీటిఎద్దడి తలెత్తకుండా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడికి ప్రత్యేక నిధులు వచ్చే పరిస్థితి లేదని, కేవలం 15ఫైనాన్స్ నిధులు మాత్రమే వస్తాయని తెలిపారు. ఈనిధులను ఇతర అవసరాలకు వాడుకోకుండా తాగునీటి సమస్యలపై మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే మండలంలో రూ.4లక్షల వ్యయంతో తాగునీటి బోర్లను మరమ్మత్తులు చేయించామని మరో రూ.5లక్షల నిధులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అదేవిధంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టామని, మరిన్ని గ్రామాల్లో టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు ముందుకు సాగలేదని వివరించారు. తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఉంటే తప్ప గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా జరగదని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు గుర్తించుకోవాలని చెప్పారు. ఇందుకు స్పందించిన ఎంపీడీవో గ్రామాల్లో నీటిఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖ పరిధిలోని పథకాలు, ఇతర అభివృద్ధి పనుల గురించి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ తిరుపాలమ్మ, జడ్పీటీసీ శంకరరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామి, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మోహన్‌కుమార్, ఎంఈవో జానకీరామ్, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి, వైద్యాధికారి పవన్‌కుమార్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో సూర్యకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్చల, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగమ్మ తదితరులు ఉన్నారు.

'సామాజిక సేవలో భాగస్వాములు కావాలి'


నట్టల నివారణ మందులు ఇస్తున్న వైద్యుడు

గోస్పాడు, మార్చి 5: విద్యార్థులు సామాజిక భాగస్వాములు కావాలని మహానంది అగ్రికల్చరల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సంతోష్‌కుమార్ నాయక్ అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు, కానాలపల్లె గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని పశువులకు గర్భకోశ పరీక్షలు, జీర్ణకోశ, శ్వాసకోశ సంబంధిత వైద్య పరీక్షలు చేయించారు. దూడలకు నట్టల నివారణ మందులను పశువైద్యాధికారి కిషోర్‌కుమార్ రెడ్డితో పంపిణీ చేయించారు. గ్రామంలో 5 రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలను వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులుగా డాక్టర్ సరోజినీదేవి, ట్రైనర్ లక్ష్మీనారాయణరెడ్డి, పశువైద్య అసిస్టెంట్ రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో' పరిశీలన

నంద్యాల రూరల్ మార్చి 5: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మంగళవారం నంద్యాల మండలంలోని పోలూరు గ్రామాన్ని సందర్శించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేయటంతో పాటు పల్స్ పోలియో తీరును పరిశీలించారు. పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారా లేదా అని సిబ్బందిని ఆరా తీశారు. పోలియో చుక్కలు వేసిన అనంతరం సంబంధిత ఇళ్ల మీద గుర్తింపు చిహ్నం వేశారా? లేదా? అని పరిశీలించారు. చాపిరేవుల ప్రాథమిక ఆరోగ్య ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ షహలం మాట్లాడుతూ పోలియో కార్యక్రమం 100శాతం దాటి 104 శాతం జరిగిందన్నారు. క్లస్టర్ వైద్యాధికారి సుధ, ఆరోగ్యం కేం ద్రం సూపర్‌వైజర్ బేబి కుమారి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మయ్య, ఏఎన్ఎం జెస్సీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

కొత్తపల్లి: ఆరోగ్యశ్రీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జవహర్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని కొక్కెరంచ, శివపురం, గోకవరం, దుద్యాల, ఎదురుపాడు, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల్లో సిబ్బంది ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలానికి 7,964 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరైనట్లు చెప్పారు. అందులో నేటికి 6,227 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే 140 మంది ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలస వెళ్లారని తెలిపారు. ఇంకా 1,297 మందికి పంపిణీ చేయాల్సి ఉందని, రెండు మూడు రోజుల్లో అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు, మార్చి 5: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పలు శైవక్షేత్రాలకు ఆత్మకూరు ఆర్టీసీ డిపో తరఫున ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచనున్నట్లు డిపో మేనేజర్ మహేంద్రుడు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డిపో శ్రీశైలానికి నుంచి 45 స్పెషల్ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 8న రుద్రకోడూరు క్షేత్రానికి 10 బస్సులు, సంగమేశ్వరం, కొలనుభారతి క్షేత్రాలకు 10 బస్సులు సాధారణ చార్జీల ప్రకారమే అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అవసరమైతే మరిన్ని సర్వీసులు సిద్ధం చేస్తామని చెప్పారు.

8 నుంచి పాణికేశ్వర స్వామి ఉత్సవాలు

పాణ్యం, మార్చి 5: పాణ్యంలోని పాణికేశ్వర స్వామి ఉత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈవో సువర్ణ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 8న లింగోద్భవకాలంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పానక పందేరం, కల్యాణోత్సవం, నెరవాడ గ్రామానికి చెందిన శిరిగిరి ప్రసాదరెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. 9న ప్రాతఃకాల పూజలు, మంగళ నీరాజనాధి కార్యక్రమం, 10న అన్నదాన కార్యక్రమం, స్వామి వారి గ్రామోత్సవం, చెక్కభజన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

శివస్వాములకు అల్పాహారం

పాములపాడు, మార్చి 5: కాలినడకన శ్రీశైలం వెళ్లే శివస్వాములకు పాములపాడులో పూనల శ్రీశైలం నిత్య అన్నదాన సేవ సత్రం కమిటీ గౌరవ అధ్యక్షుడు ఆకుతోట రాజశేఖర్, అధ్యక్ష కార్యదర్శి నాయిని రామ స్వామి, బత్తిని పెద్దస్వామి అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది శివరాత్రి, ఉగాది పర్వదినాలకు శ్రీశైలం పాదయాత్ర చేసే శివస్వాములకు, కన్నడ భక్తులకు అన్నదానం, అల్పాహారం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మధు, ప్రసాద్, గోపాల్, వెంకటేశ్వరరావు, మనోహర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య పరిష్కరించాలి'

పాణ్యం, మార్చి, 5: మండలంలోని తమ్మరాజుపల్లెలో తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను పరిష్కరించాలని మహిళలు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన మండలంలోని నెరవాడ, తమ్మరాజుపల్లె, మద్దూరు గ్రామాలలోని పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి వచ్చారు. ఈ సందర్భంగా తమ్మరాజుపల్లెలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమ వీధులకు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. నీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌ను ఆదేశించారు, అధికారులను ఆదేశించారు.

'ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి'

పాణ్యం, మార్చి, 5: ఓటు సక్రమంగా వినియోగించుకోవాలని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం నా మొదటి ఓటు దేశాభివృద్ధికే అన్న నినాదంతో రసూళ్లపేట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకొని దేశాభివృద్ధికి పాటు పడాలని కోరారు. మొదటి సారి ఓటు వినియోగించుకొనే వారు సరైన నిర్ణయాన్ని తీసుకొనిఇ ఓటుతో తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నాగరాజు, వలంటీర్లు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సు ప్రారంభం

పాణ్యం, మార్చి 5: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సాంకేతిక జాతీయ సదస్సు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో జిల్లాలోని పలు ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు దాదాపు వంద మంది పాల్గొన్నట్లు సదస్సు కన్వీనర్, హెచ్‌వోడీ మల్లికార్జున తెలిపారు. ఈ సదస్సులో విద్యార్థులు పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్ మైండ్స్, కోడ్ ఫెస్ట్, సర్క్యూట్ డెబగ్గింగ్ అంశాల పోటీలు నిర్వహించారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాళ్లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ సతీష్, లీలామహేంద్ర కుమార్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పాములపాడు, మార్చి 5: పాములపాడులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. దీంతో రైతుల కరెంటు కష్టాలు తొలుగుతాయని విద్యుత్ డీఈ సురేశ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 3 కోట్లతో రెండు 8 మెగా ఓల్టేజీ కలిగిన రెండు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో మొదటగా ఒకటి ఏర్పాటు చేశామని, రెండవది పది రోజుల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీంతో రైతులకు ఒకే విడతలో పగటిపూట నాణ్యమైన 9 గంటలు నిరంతరంగా కరెంటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఈ అబ్దుల్ అబీద్, లైన్‌మెన్, అసిస్టెంట్ ఎల్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

ఆత్మకూరు, మార్చి 5: రైతుల పంటలను నమోదు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న నల్లకాల్వ గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పెల సుధాకర్ రైతులతో కలిసి ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ పంటల ఈకేవైసీ నమోదులో నల్లకాల్వ వీఏవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఫీల్డ్ విజిట్ చేయకుండా వలంటీర్లచే అసంపూర్ణ సమాచారం తీసుకుంటూ రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సమయపాలని పాటించడం లేదని చెప్పారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న నల్లకాల్వ వీఏవోపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

'సైన్స్‌పై అవగాహన ఉండాలి'

పాణ్యం, మార్చి 5: విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన ఉండాలని పాణ్యం సీఐ నల్లప్ప అన్నారు. మంగళవారం పాణ్యం జ్వాలా లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మూఢనమ్మకాలతో మోసపోతున్నారని సైన్స్ గురించి చిన్నప్పటి నుంచే అవగాహన ఉండడంతో మూఢ నమ్మకాలను నిరోధించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జ్వాలా నరసింహులు, జ్వాలా నారాయణ, కౌలూరు శీను, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందికొట్కూరు, మార్చి 5: కర్ణాటకకు చెందిన మద్యాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఆ శాఖ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. నందికొట్కూరులోని అల్లూరు క్రాస్ వద్ద ద్విచ క్ర వాహనంపై కర్ణాటకు చెందిన 384 టెట్రా ప్యాకెట్లను తీసు కెళ్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు నందికొట్కూరుకు చెందిన విజయకుమార్, తుగ్గలి మండలం రామలింగాయపల్లికి చెందిన హరికృష్ణను అరెస్టు చేసి 384 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యంతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఎస్ఐ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడి వృద్ధురాలి మృతి

పాణ్యం, మార్చి 5: పాణ్యం ఎస్సార్బీసీ మెయిన్ కాల్వలో పడి అలమూరు గ్రామానికి చెందిన బి. వెంగమ్మ(65) మృతి చెందినట్లు పాణ్యం పోలీసులు తెలిపారు. మంగళవారం మృతదేహం కాలువలో ఉండగా స్థానికులు గుర్తించి సమాచారం అందించినట్లు తెలిపారు. ఫిర్యాదు రాలేదని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని చెప్పారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

ప్రజలకు సేవ చేసేందుకే పార్టీ మారా..

ఆళ్లగడ్డ, మార్చి 5: బీజేపీలో ఉంటే ప్రజలకు సేవ చేయలేనని పార్టీని వీడి వైసీపీలో చేరానని భూమా కిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వానికి రాజీనామా చేశానని, రాష్ట్రంలో బీజేపీ పొత్తుల కోసం పోరాటం చేస్తుందే తప్ప కార్యకర్తలకు, నాయకులకు ఎలాంటి భరోసా లేదన్నారు. కార్యకర్తలపై కేసులు నమోదైతే వాటి నుంచి కార్యకర్తలను కాపాడుకునే పరిస్థితి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపిస్తానని అన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


శిరివెళ్లలో ప్రగతి నివేదిక వినిపిస్తున్న అధికారి

శిరివెళ్ల, మార్చి 5 : మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఫణి రాజకుమారి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ సూచించారు. మండలంలో దాదాపు 250 చేతిపంపులు ఉన్నాయని, వాటి మరమ్మతులకు అవసరమైన సామాగ్రి సైతం అందుబాటులో ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్ తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మందకోడిగా సాగుతున్నాయని, లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉన్నాయని హౌసింగ్ ఏఈ నాగ శేఖర్ వెల్లడించారు. ఈ ఏడాది రబీలో 4,276 హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగు చేశారని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్నలు విక్రయించిన రైతుల్లో 70 శాతం రైతులకు సొమ్ము వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. అనంతరం మరిన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ నాయక్ దిల్షాద్, ఈవోపీఆర్డీ నాగేంద్ర, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 5: మండలంలోని మల్లేవేముల, మద్దూరు, శెట్టివీడు, గొడిగనూరు, ముత్యాలపాడు సచివాలయాలను మంగళవారం ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో సంబంధిత రికార్డులను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి విధులు నిర్వహించాలని సూచించారు. కొత్తగా మంజూరైన 11,728 ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

5,200 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి


చాగలమర్రిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రామకృష్ణ

చాగలమర్రి, మార్చి 5: జిల్లాలో 5,200 పక్కా గృహాల పనులు పూర్తయినట్లు హౌసింగ్ పీడీ రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని కూలూరు రహదారి, కస్తూర్బా పాఠశాల సమీపంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న గృహాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ హరిగోపాల్, డీఈ నాగరాజు, ఏఈ షఫివుల్లా, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

చాగలమర్రి, మార్చి 5: ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి ఉంచామని నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, చిన్నవంగలి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల గురించి సెక్టోరల్ అధికారులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ 34 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, 295 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రమణమ్మ, డీటీ విజయ్ కుమార్, వీఆర్వోలు, బీఎల్‌వోలు ఉన్నారు.

నేడు మార్కెట్ వేలం

శిరివెళ్ల, మార్చి 5 : శిరివెళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దిన మార్కెట్, వారపు సంత, కబేళాకు సంబంధించి 2024-25 సంవత్సరానికి గాను రుసుములు వసూలు చేసుకునే హక్కును పొందేందుకు బుధవారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ నాగేంద్ర మంగళవారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు వారపు సంతకు రూ.50 వేలు, దిన మార్కెట్‌కు రూ.40 వేలు, కబేళాకు రూ.10 వేలు చొప్పున డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందన్నారు. సాల్వెన్సీ సర్టిఫికెట్ లేని వ్యక్తులు రెట్టింపు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని ఈవోపీఆర్డీ తెలిపారు.

టీడీపీలోకి భారీగా చేరికలు


కోవెలకుంట్లలోగ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, మార్చి 5: టీడీపీలోకి భారీగా వైసీపీ నాయకులు చేరుతున్నారు. వైసీపీ చేస్తున్న అరాచకాలకు విసుగుచెంది టీడీపీలో చేరుతున్నామని వారు పేర్కొంటున్నారు. మంగళవారం కోవెలకుంట్లలోని ఇందిరమ్మ కాలనీకిచెందిన 15 కుటుంబాలు బీసీ సమక్షంలో టీడీపీలో చేరారు. చేరిన వారిలో కాలనీకిచెందిన కావాడి ఏసుబాబు, సద్దాం, కావాడి ఏసుపాదం, కావాడి రాజు, శాంతి, రాజు, రవి, వాసు, మాధవ్, శాంతకుమార్, ప్రవీణ్, ప్రేమ్, రాజు, విశాల్, కృపవరం, కపరాజు, రత్నకుమార్ తదితరు 15 కుటుంబాలు ఉన్నాయి. బీసీ జనార్దన్‌రెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసి టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

● టీడీపీతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని స్వామినగర్ కాలనీలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీమార్కెట్‌యార్డు ఛైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, లాయర్ శ్రీకాంత్, గడ్డం అమర్‌నాథ్‌రెడ్డి, పెనుగొండ రాజశేఖర్, కులాయి, జనసేన పార్టీనాయకలు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి సాగనంపండి


బుగ్గానిపల్లెలో టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి, నాయకులు

బేతంచెర్ల, మార్చి 5: వైసీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఇంటికి సాగనంపాలని డోన్ టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాయ్య అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ మేనిఫెస్టో పతకాలను వివరిస్తూ పంపిణీ చేశారు. కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఉన్న సహజ వనరులన్నీ కొల్లగొట్టారన్నారు. రాష్ట్ర వనరులను, రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగించకుండా సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ అక్రమ మార్గంలో సంపాధించి దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. సంపదను సృష్టించలేక సహజ వనరులను కొల్లగొట్టి, తన బినామి కంపెనీలకు మళ్లించారన్నారు. మరోసారి జగన్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని దివాలా తీయించి మరో బీహార్ రాష్ట్రంగా మార్చడం ఖాయమన్నారు. టీడీపీ ప్రవేశ పెట్టిన అభివృద్ధి పథకాలతో మార్పు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ నాయకురాలు మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, భీమేశ్వరరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు జాకీరుల్లా భేగ్, గూటుపల్లె ముల్లా, అంబాపురం సర్పంచ్‌శ్రీనివాస్ యాదవ్, ఆర్.బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, రూబెన్, మేకల నాగరాజు, రాముడు, పుట్టపాశం వెంకటేశ్వర్లు, సుభాన్, మంచినీళ్ల సుమంత్ క్యాకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం


డబ్ల్యూ.గోవిందిన్నెలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

దొర్నిపాడు, మార్చి 5: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబును గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే భూమా అఖిల ప్రియను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా సంతోష్‌రెడ్డి, భూమా సందిప్‌రెడ్డి, ఏరువ ప్రసాదురెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సిద్ధి సత్యం, అమరసాని రవికుమార్, శ్రీనివాసులు, రామచంద్రాపురం దయానందరావు, మల్లేశ్వరచౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, జగదీశ్వర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేస్తా

● టీడీపీ సీనియర్ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

బేతంచెర్ల, మార్చి 5: చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ విజయానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని డోన్ సీనియర్ నాయకుడు ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బేతంచెర్ల టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ తాను టీడీపీకే పని చేస్తానన్నారు. తన వెంట ఉన్న నాయకులను కానీ, కార్యకర్తలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే తాను అండగా ఉంటూ భరోసా ఇచ్చానన్నారు. కార్యక్రమంలో డోన్ బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రమలనాయుడు, రమేష్, మల్లిపెద్ది నాగేశ్వరరెడ్డి, వార్డు కౌన్సిలర్లు రామగోపాల్, రామ్మూర్తి, నంద్యాల మధు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన వైసీపీ ప్రభుత్వం: సీపీఐ


బనగానపల్లెలో సచివాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

బనగానపల్లె, మార్చి 5 : వైసీపీ ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచిందని సీపీఐ నాయకులు శివయ్య, సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లెలో సచివాలయ సిబ్బందికి రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఒక్కచాన్సు అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించి భూయాజమాన్య చట్టాలు రైతుల నెత్తిన బండ వేయడమే నని విమర్శించారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు పేరుతో ఉచిత విద్యుత్‌ను దశలవారీగా ఎత్తివేసే ఆలోచన వైసీపీ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. అలాగే భూయాజమాన్య హక్కుల చట్టం వల్లరైతులు తమ సొంత స్థిరాస్తులపై హక్కులు కోల్పోనున్నట్లు తెలిపారు. జిల్లాలో 29 మండలాలు కరువుతో అల్లాడుతుంటే కేవలం 6 మండలాల్లోనే కరువు ఉన్నట్లు ప్రకటించి మిగతా రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. వాటికి ఇంత వరకు నష్టపరిహారం అందించలేదన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వల్ల రైతులు నష్టపోతుంటే మరో వైపు ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు కుదేలవుతున్నారన్నారు. వ్యవసాయ అధికారులు రాజకీయ నాయకుల సేవల్లో తరించిపోతున్నారని విమర్శించారు. రైతులకు వెంటనే న్యాయం చేయాలని సచివాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో శివనాగయ్య, సంజీవులు, మాబు, సుబ్రహ్మణ్యం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

14,800 వెదుర్లు వేలం


వెదురు వేలం నిర్వహిస్తున్న సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

రుద్రవరం, మార్చి 5 : రుద్రవరం కలప డిపోలో మంగళవారం సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి వెదురు వేలాన్ని నిర్వహించారు. ఈ వేలంలో మొదటి తరగతి 200, 2వతరగతి 4వేలు, 3వతరగతి 10600 మొత్తం 14800 వెదుర్లు వేలం వేయగా రూ.4 లక్షల మేర ఆదాయం వచ్చింది. ఈ ఆదాయాన్ని ప్రభుత్వ ఖాతాకు జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, సెక్షన్ ఆఫీసరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ అందరి లక్ష్యం కావాలి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మానందాచారి

బనగానపల్లె, మార్చి 5 : స్వచ్ఛభారత్ అందరి లక్ష్యం కావాలని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మంగళవారం నందవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛభారత్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వివిధ జబ్బులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయుడు నరసింహుడు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరాములు, మహమ్మద్‌హుసేన్, నాగరాజు, కళ్యాణి పాల్గొన్నారు.

4,160 మంది పిల్లలకు పోలియో చుక్కలు


చాగలమర్రిలో సంచారజీవుల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యులు

చాగలమర్రి, మార్చి 5: మండలంలోని ఆయా గ్రామాల్లో మూడు రోజుల పాటు 4,160 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు ఇమ్రాన్ తెలిపారు. మంగళవారం మూడవ రోజు కూలూరు రహదారిలో గుడారాల్లో నివాసం ఉంటున్న సంచారజీవుల పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 శాతం పోలియో చుక్కలు వేశామని అన్నారు. వైద్య సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు కలిసి ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ


చింతలచెరువులో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

చాగలమర్రి, మార్చి 5: మండలంలోని చింతలచెరువు, పెద్దవంగలి ప్రాథమిక పాఠశాలలను ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల మంగళవారం తనిఖీ చేశారు. చింతలచెరువు పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల పరిశీలించారు. నాణ్యతగల కోడిగుడ్లు పంపిణీ చేయాలని అన్నారు. మెను ప్రకారం భోజనం తయారు చేయాలని అన్నారు. పెద్దవంగలి ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ సందర్శించి రికార్డులను పరిశీలించారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కలిసిరండి: కోట్ల


కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని సన్మానిస్తున్న టీఈ శేషఫణి గౌడు కుటుంబ సభ్యులు

డోన్, మార్చి 5: రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీతో అందరూ కలిసి రావాలని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మాజీ ఎంపీపీ టీఈ శేషఫణిగౌడు ఇంటికి వెళ్లి కోట్ల మద్దతు కోరారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో సానుకూలంగా స్పందించి శేషఫణిగౌడు కలిసి పని చేస్తామని కోట్లకు మద్దతు తెలిపారు. చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుస్తూ శేషఫణిగౌడు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందని కోట్ల ఈ సందర్భంగా అన్నారు. కోట్ల వెంట మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, చిట్యాల మద్దయ్యగౌడు తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

డోన్: పట్టణంలోని ఓబులాపురం శేషిరెడ్డి స్వగృహంలో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సమక్షంలో మంగళవారం కొత్తబురుజు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వైసీపీ కార్యకర్తలు రాజు, పాణి ప్రతాప్, రామాంజనేయులు, పెద్దయ్య, మహేష్, విశ్వనాథం, సుధాకర్, నారాయణ స్వామి, దేవేంద్ర, ఓబులపతితో పాటు మరో పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని కోట్ల అన్నారు.

వైసీపీ అరాచక పాలనకు గుణపాఠం తప్పదు


చాగలమర్రిలో సూపర్-6 కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

చాగలమర్రి, మార్చి 5: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని కుమ్మరి వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్-6 కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగూర్‌వలి, రామకృష్ణ, మక్బూల్, మహిళలు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్ర అభివృద్ధి


చిత్తరేణిపల్లెలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

రుద్రవరం, మార్చి 5 : చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు ఫక్కీరయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో బాబు సూపర్‌సిక్స్ బ్యానర్లు ఏర్పాటు చేసి కరపత్రాలను పంపిణీ చేశారు.

● వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రభుత్వం వస్తుందని టీడీపీ నాయకులు ముద్దం ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని చిత్తరేనిపల్లె గ్రామంలో బాబు సూపర్‌సిక్స్ బ్యానర్‌ను కట్టి బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీలోభాగంగా కరపత్రాలు పంపిణీ చేసి ప్రజల్లో చైతన్యం తెచ్చా రు.

రబీ-2023 పంట నమోదు జాబితా ప్రదర్శన

బేతంచెర్ల, మార్చి 5: రబీ సీజన్-2023లో రైతులు వేసిన పంటలను రైతు భరోసా కేంద్రం సిబ్బంది పంట నమోదు చేసి పూర్తి చేయడం జరిగిందని మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామంలో ఆర్‌బీకే కేంద్రం వద్ద నమోదు చేసిన జాబితాను సంబంధిత రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శనగా ఉంచారన్నారు. రైతులు తాము వేసిన పంటలు సరిగా నమోదు జరిగిందో లేదో రైతు భరోసా కేంద్రంలో సరి చేసుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే ఆర్‌బీకే సిబ్బందికి తెలియజేసి సరి చేసుకోవాలని ఆయన రైతులను సూచించారు.

బేతంచెర్లలో మహిళలు కలశాలతో ర్యాలీ

బేతంచెర్ల, మార్చి 5: డోన్ నియోజకవర్గంలోని గోరుకల్లు రిజర్వాయర్ నుంచి బేతంచెర్లకు చేరిన కృష్ణమ్మ జలాలకు జలహారతి పూజలును మహిళలు నిర్వహించారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బేతంచెర్ల ప్టటణానికి తీసుకుని వచ్చారు. మంగళవారం పట్టణంలోని మహిళలందరూ భారీ ర్యాలీగా సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న వాటర్ పంపు దగ్గర గంగమ్మకు జలహారతులు ఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు, ఎంపీపీ నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.

కూలీలు ఉపాధి పథకం సద్వినియోగం చేసుకోండి

బేతంచెర్ల, మార్చి 5: కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ముద్దవరం గ్రామ పంచాయతీలో కొండలో కందకాల పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో సురేంద్ర కుమార్ మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేస్తే 272, అదే విధంగా వేసవి తాపం నుంచి తప్పించుకునేందుకు ఉదయం త్వరగా పనులకు హాజరు కావాలని తాగునీరు ఎక్కువగా తెచ్చుకోవాలని, ప్రమాదాలకు గురి కాకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీవో శేషన్న, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ మహేంద్ర పాల్గొన్నారు.

ఊటకొండలో రాతిదూలం, కబడ్డీ పోటీలు

ప్యాపిలి, మార్చి 5: మహాశివరాత్రి పండుగను పురష్కరించుకొని మండలంలోని ఊటకొండ గ్రామంలో రాష్ట్ర స్థాయి రాతిదూలం, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 9న కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేలు, రూ.5 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11న దూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందే వృషభాలకు వరుసగా రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు 8073502169లను సంప్రదించాలని కోరారు.

మంగళగిరికి తరలివెళ్లిన నాయకులు

కొలిమిగుండ్ల ,మార్చి 5 : మంగళగిరిలో మంగళవారం జరిగిన బీసీ డిక్లరేషన్ సభకు కొలిమిగుండ్ల టీడీపీ నాయకులు తరలివెళ్లారు. మండల ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి, నాయకులు ఎన్. ప్రసాద్, టైలర్ రాముడు, ఎద్దుల వెంకటేశ్వర్లు, నాగ కుళ్ళాయి ,రమణ, ఉలవల ప్రసాద్, నాగేశ్వరరావు వెళ్లారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడం ఖాయమని తెలిపారు.

టికెట్‌పై భరోసా

ఆళ్లగడ్డ, మార్చి 5: వచ్చే ఎన్నికల్లో ఆళ్లగడ్డ అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి భరోసా ఇచ్చారని ఆ పార్టీ ఆళ్లగడ్డ నాయకుడు బరగొడ్ల హుసేన్‌బాషా చెప్పారు. ఆయనను మంగళవారం అనంతపురం జిల్లా నీలకంఠాపురంలో సన్మానం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈయన వెంట కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనరసింహుడు, నూర్ అహమ్మద్ ఉన్నారు.